సంక్షేమ పథకాల్లో తెలంగాణ ఫస్ట్

మరిపెడ: సంక్షేమ పథకాలు దేశంలో మనమే మొదటి వరుసలో ఉన్నామని, ఆ ఘనత సీఎం కేసీఆర్‌కే దక్కుతుందని ఎమ్మెల్యే డీఎస్ రెడ్యా నాయక్ అన్నారు. దశాబ్ది ఉత్సవాలలో భాగంగా మరిపెడ మున్సిపల్ కేంద్రంలోని ఆడిటోరియంలో డోర్నకల్ నియోజకవర్గస్థాయిలో సంక్షేమ సంబురాల కార్యక్రమం నిర్వహించారు. లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి చెక్కులను పంపిణీ చేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. గత ప్రభుత్వాల కంటే అభివృద్ధి పథకాల అమలు జరుగుతుందన్నారు. రైతుబంధు, రైతు బీమా, ఆసరా పింఛన్లు ఇస్తున్న సంగతి తెలిసిందేనన్నారు. అంతే కాకుండా ప్రభుత్వ ఆస్పత్రుల్లో మెరుగైన ద్వారా ప్రసవాల సంఖ్య పెరిగిందన్నారు. అదే విధంగా విద్య పట్ల శ్రద్ధ చూపి గురుకులాలు, సంక్షేమ హాస్టళ్లలో నాణ్యమైన భోజనంతోపాటు విద్యార్థుల సంఖ్య గణనీయంగా పెరిగిందన్నారు. ప్రైవేట్ పాఠశాలలు అనేకం మూతపడ్డాయన్నారు. ఇటీవలే చేతి వృత్తుల వారికి ప్రభుత్వం రూ. లక్ష ఆర్థికసాయానికి పథకం ప్రవేశపెట్టిందన్నారు. కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ అభిలాషఅభినవ్, జెడ్పీ వైస్ వైస్ చైర్మన్ వెంకటేశ్వరరెడ్డి, మరిపెడ, డోర్నకల్ మున్సిపల్ చైర్మన్‌లు గుగులోతు సింధూరరవికుమార్, వాంకుడోతు వీరన్న, ఎంపీపీ అరుణరాంబాబు, జెడ్పీటీసీ శారద రవీందర్‌తోపాటు ఇతర మండలాల ఎంపీపీలు, జెడ్పీటీసీలు, సీడీపీఓ శిరీషా, తహసీల్దార్ రాంప్రసాద్, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కేసీఆర్ పాలనలో గ్రామాలు సస్యశ్యామలం

నెల్లికుదురు: తెలంగాణ రాష్ట్రంలో గ్రామాలను సస్యశ్యామలం చేసిన ఘనత కేసీఆర్ ప్రభుత్వానికే దక్కిందని ఎమ్మెల్యే బానోత్ శంకర్ నాయక్ అన్నారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణంలో శుక్రవారం దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా నియోజకవర్గ స్థాయి సంక్షేమ సంబురాల కార్యక్రమం ఎంపీపీ ఎర్రబెల్లి మాధవి అధ్యక్షతన నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఎమ్మెల్యేను బతుకమ్మలు, బోనాలతో స్వాగతం పలికారు. సంక్షేమ సంబురాల కార్యక్రమంలో జ్యోతి ప్రజ్వలన వెలిగించి జాతీయ గీతాన్ని ఆలపించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్రం ఏర్పడ్డాక ముందు గ్రామాల పరిస్థితిని గుర్తు చేశారు. గత ప్రభుత్వ పాలనలో తాగునీటి కోసం వ్యవసాయ బావులు కిరాయికి తీసుకుని ట్యాంకర్ల ద్వార అందించే వారని, పంటల సాగుకు విద్యుత్, సాగునీరు, పండిన పంటలకు గిట్టు బాటు ధర లేక ప్రజలు ఎన్ని ఇబ్బందులు పడే వారో గుర్తు చేశారు. కేసీఆర్ ప్రభుత్వంలో తెలంగాణ రాష్ట్రంలో 10జిల్లాలను 33 జిల్లాలుగా చేపట్టి, నూతన మండలాలు, గ్రామ పంచాయితీలుగా గుర్తించి పరిపాలను సులభతరం చేసిన ఘనత కేసీఆర్‌కే దక్కిందన్నారు. పెన్షన్లు, రైతుబంధు, రైతు బీమా, సాగునీరుకు ప్రాజెక్టులు నిర్మించి 80వేల మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడికి బదులు ఇప్పుడు 2.40లక్షల మెట్రిక్ టన్నుల ధాన్య దిగుబడి వస్తుందని గుర్తు చేశారు. అనంతరం లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి చెక్కులను అందించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ డేవిడ్, ఆర్డీఓలు కొమురయ్య, రమేష్, సర్పంచ్ బీరవెల్లి యాదగిరిరెడ్డి, ఎంపీటీసీ సభ్యురాలు వెన్నాకుల వాణి శ్రీను, జడ్పీటీసీలు మేకపోతుల శ్రీనివాసరెడ్డి, ప్రియాంక, రైతు సమితి జిల్లా కోఆర్డినెటర్ భూక్య బాలాజి నాయక్, మండల ప్రత్యేక అధికారి సూర్య నారాయణ, తహసీల్దార్ యోగేశ్వరరావు, ఎంపీడీఓ శేశాద్రి పాల్గొన్నారు.



నెల్లికుదురు: జాతీయగీతం ఆలపిస్తున్న ఎమ్మెల్యే శంకర్‌నాయక్, తదితరులు



మరిపెడ: మాట్లాడుతున్న ఎమ్మెల్యే రెడ్యానాయక్

నిరుపేదల అభ్యున్నతే ధ్యేయం

గార్ల: నిరుపేదల అభ్యున్నతే ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే బానోత్ హరిప్రియ అన్నారు. తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా ముస్లిం మైనారిటీ సంక్షేమ శాఖ ద్వార గార్లకు చెందిన అఫ్జల్‌ఖాన్‌కు సబ్సిడీపై మంజూరైన షిఫ్ట్ డిజైర్ కారును ఎమ్మెల్యే అందజేశారు. అనంతరం లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ రాము, ఎంపీడీఓ రవీందర్, రైతుబంధు సమితి మండల అధ్యక్షుడు రాధాకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.



గార్ల: కారు అందజేస్తున్న ఎమ్మెల్యే హరిప్రియ

పట్టాలు ఇవ్వాలి

నెహ్రూసెంటర్: ప్రభుత్వ భూముల్లో గుడిసెలు వేసుకుని ఉంటున్న దివ్యాంగులకు 58 జీఓ ద్వారా పట్టాలు ఇవ్వాలని ఎంఎస్పీ జిల్లా కోఆర్డినేటర్ గుగ్గిళ్ల పీరయ్య డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలోని దివ్యాంగుల కాలనీ గుడిసెల వద్ద ఏర్పాటు చేసిన దీక్షా శిబిరాన్ని శుక్రవారం ఆయన సందర్శించి మాట్లాడారు. ప్రభుత్వం రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాలు నిర్వహిస్తున్న నేపథ్యంలో పేదలకు ఇళ్ల స్థలాలు, పట్టాలు, డబుల్ బెడ్రూం ఇళ్లను మంజూరు చేయాలన్నారు. కార్యక్రమంలో చలగోల వెంకన్న, ఎండి.రజీయా, కత్తుల రేణుక, సంగిపాంగు శ్రీను, చంద్రశేఖర్, వెంకటేశ్వర్లు, నారాయణ, శ్రీను పాల్గొన్నారు.

నేడు లోక్ అదాలత్

డోర్నకల్: మహబూబాబాద్ కోర్టులో శనివారం జరిగే లోక్ అదాలత్‌ను వినియోగించుకోవాలని డోర్నకల్ సీఐ వెంకటరత్నం కోరారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. జిల్లా అడిషనల్ మెజిస్ట్రేట్ కోర్టులో లోక్ అదాలత్ జరగనున్నట్లు తెలిపారు. యాక్సిడెంట్లు, గొడవలు, భూవివాదాలు, కుటుంబ తగాదాలు, దొంగతనాలు, అక్రమ రవాణా, పేకాట, లాక్‌డౌన్ సమయంలో నమోదైన కేసులు, ట్రాఫిక్, గుట్కా రవాణా కేసులకు సంబంధించి లోక్ అదాలత్‌లో రాజీ చేసుకునే అవకాశాలు ఉన్నట్లు తెలిపారు. పైకేసులకు సంబంధించి ఫిర్యాదుదారుడు, నేరస్తుడు ఆధార్ కార్డులతో పోలీస్ స్టేషన్‌లో సంప్రదించాలని సూచించారు.

క్లుప్తంగా

లక్ష్మణ్‌కు కలెక్టర్ అభినందన



మహబూబాబాద్ అర్బన్: లాంగెస్ట్ మ్యాథమెటిక్స్‌లో గవర్నర్ చేతుల మీదుగా మానుకోట జిల్లా కేంద్రానికి చెందిన లక్ష్మణ్ గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డు సర్టిఫికెట్‌ను అందుకున్నాడు. ఈ సందర్భంగా కలెక్టర్ కార్యాలయంలో కలెక్టర్ కె.శశాంక లక్ష్మణ్‌ను శుక్రవారం అభినందించారు.

బిర్సాముండా వర్ధంతి

మహబూబాబాద్ అర్బన్: జిల్లా కేంద్రంలోని ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ సంఘం ఆధ్వర్యంలో బిర్సాముండా వర్ధంతి పురస్కరించుకొని శుక్రవారం ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు పార్నది రామయ్య, నాయకులు బిర్సాముండా చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షులు చాగంటి ప్రభాకర్, నాయకులు వీరస్వామి, దాసరి మహేందర్, విజయలక్ష్మి, వసంత పాల్గొన్నారు.

'బీఆర్‌ఎస్‌కు రోజులు దగ్గరపడ్డాయి'



దంతాలపల్లి: బీఆర్‌ఎస్ ప్రభుత్వానికి రోజులు దగ్గర పడ్డాయని బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి చీకటి మహేష్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. మోదీ సంక్షేమ పథకాలే కేంద్రంలో, రాష్ట్రంలో పార్టీని అధికారంలోకి తీసుకువస్తాయని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. క్రిమినల్ కేసులు పెట్టాలని, కొంత మంది పింఛన్ తీసివేయాలని ఎమ్మెల్యే రెడ్యానాయక్ బహిరంగంగా చెప్పడం సిగ్గుచేటు అన్నారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు సందెల శ్రీనువాస్, మానుకోట పార్లమెంట్ కన్వీనర్ సింగారపు సతీష్, అసెంబ్లీ కన్వీనర్ తాడ పూర్ణచందర్‌రెడ్డి, నాయకులు దాసరి మురళి, కారుపోతుల ఉప్పలయ్య, మహిళా మోర్చా మండల అధ్యక్షురాలు సరెడ్డిరాణిరెడ్డి పాల్గొన్నారు.

పేరు మార్పు



సాక్షి ఎఫెక్ట్..

గార్ల: 'జిల్లా పేరు మార్చడంలో నిర్లక్ష్యం' అనే శీర్షికన ఇటీవల సాక్షి దినపత్రికలో వచ్చిన కథనానికి స్పందించిన జీపీఎస్ పాఠశాలల పే యూనిట్ హెచ్‌ఎం డి.కోటేశ్వరీ ఆదేశాల మేరకు మండలంలోని పీక్లీతండా పాఠశాల ఉపాధ్యాయులు పాఠశాల భవనంపై ఉన్న పాత ఖమ్మం జిల్లా పేరును తొలగించి మహబూబాబాద్ జిల్లాగా పేరు మార్చారు.

పోలీస్ కళాజాతా

చిన్నగూడూరు: జిల్లా ఎస్పీ ఆదేశానుసారం చిన్నగూడూరు పోలీస్ ఆధ్వర్యంలో కళాజాతా నిర్వహించారు. శుక్రవారం మండల కేంద్రంలోని వైవీ సభ ప్రాంగణంలో స్థానిక ప్రజలకు సైబర్ నేరాలు, సారాయి, గుట్కా, గంజాయి, మూఢనమ్మకాలపై కళాజాతా బృందం ద్వారా అవగాహన కల్పించారు. అనంతరం ఎస్సై సంతోష్ కుమార్ మాట్లాడుతూ.. సైబర్ నేరాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు.

చెక్కు అందజేత

గంగారం: మండలంలోని కోమట్లగూడెం గ్రామ శివారులోని ఎల్లాపురం గ్రామానికి చెందిన సోమక్కరావుకు రూ.50వేల సీఎం సహాయ నిధి చెక్కును శుక్రవారం జెడ్పీటీసీ ఈసం రమసురేష్, ఎంపీపీ సువర్ణపాక సరోజన జగ్గారావు, వైస్‌ఎంపీపీ ముడిగ పోతయ్య అందించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు జాడి వెంకటేశ్వర్లు, మాదారం కొమురయ్య, ముడిగ విజయ్, అక్కపెల్లి సాంబయ్య పాల్గొన్నారు.

బియ్యం పంపిణీ

నర్సింహులపేట: మండలంలోని కొమ్ములవంచలో ఇటీవల మృతి చెందిన డొనికెన మలుసూరమ్మ కుటుంబానికి హెల్పింగ్ హ్యాండ్స్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో శుక్రవారం 75కేజీల బియ్యం అందజేశారు. కార్యక్రమంలో విజయ్, సఫీ, రాంబాబు, తిరుమలేష్ పాల్గొన్నారు.

కంఠమహేశ్వరుడికి పూజలు

బయ్యారం: గౌడ కులస్తుల ఆరాధ్య దైవమైన కంఠమహేశ్వరుడికి శుక్రవారం బయ్యారం మండలంలోని రంగాపురం, జగ్గుతండా గ్రామాల నుంచి గౌడ కులస్తులు బిందెలతో ర్యాలీ నిర్వహించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. గౌడ కులస్తులు, పెద్దలు శ్రీను, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

ఉద్యమకారులను ప్రభుత్వం ఆదుకోవాలి



సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు

మహబూబాబాద్ అర్బన్: తెలంగాణ మలి దశ ఉద్యమకారులను ప్రభుత్వం ఆదుకోవాలని దగాపడ్డ తెలంగాణ మలి దశ మానుకోట ఉద్యమకారుల ఐక్యవేదిక నాయకులు ఎండి.అహ్మద్ ఖాన్ అన్నారు. జిల్లా కేంద్రంలోని ఆర్‌ఎంబీ గెస్ట్ హౌస్‌లో శుక్రవారం ఉద్యమకారులు ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా అహ్మద్ ఖాన్ మాట్లాడుతూ.. జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన అమరవీరుల స్థూపంలో అసలైన ఉద్యమకారుల పేర్లు మరిచి ఉద్యమ ద్రోహుల పేర్లను పెట్టారన్నారు. కమిటీ సభ్యుడు దార్ల శివరాజ్ మాట్లాడుతూ.. ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం కోసం పోరాడిన ఉద్యమకారులకు ఎలాంటి అభివృద్ధి ఫలాలు అందలేదన్నారు. ఈనెల 12 జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం, 16న తహసీల్దార్ కార్యాలయం ఎదుట సామూహిక దీక్ష, 21న తెలంగాణ సిద్ధాంత కర్త ప్రొఫెసర్ జయశంకర్ వర్ధంతి సభ నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో స్టీరింగ్ కమిటీ సభ్యులు సుధాకర్, పుచ్చకాయల రామకృష్ణ, వీరన్న, పొన్నాల యుగేందర్, గుంజే హన్మంతు, ఖయ్యుమ్, రాము పాల్గొన్నారు.

ఉత్సవాల పేరిట ప్రజాధనం దుర్వినియోగం



నిరసన తెలుపుతున్న నాయకులు

తొర్రూరు: రాష్ట్ర దశాబ్ది ఉత్సవాల పేరిట ప్రభుత్వం ప్రజాధనాన్ని దుర్వినియోగం చేస్తోందని ప్రజాపంథా ఉమ్మడి జిల్లా సహాయ కార్యదర్శి కొత్తపల్లి రవి అన్నారు. దీక్షా దివస్ పేరిట ప్రజాపంథా పార్టీ ఆధ్వర్యంలో శుక్రవారం డివిజన్ కేంద్రంలోని ఆర్డీఓ కార్యాలయం ఎదుట నిరసన తెలిపారు. అంతకు ముందు పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. రవి మాట్లాడుతూ.. ఎన్నికల ముందు ఉత్సవాల పేరిట ప్రజాధనాన్ని నీళ్లలా ఖర్చు చేస్తున్నారన్నారు. ప్రజలకు కేసీఆర్ ఇచ్చిన హామీలు అన్నినెరవేర్చాలన్నారు. కార్యక్రమంలో నాయకులు ములుకూరి జగ్గన్న, డివిజన్ కార్యదర్శి ముంజంపల్లి వీరన్న, నాయకులు వెంకటేశ్వర్లు, రాములు, యాకయ్యలు పాల్గొన్నారు.

విద్యాభివృద్ధికి కృషి అభినందనీయం

గూడూరు: సామాజిక సేవా దృక్పథంతో గ్రామీణ ప్రాంతంలో విద్యాభివృద్ధికి కృషి చేయడం అభినందనీయమని సర్పంచ్ బానోత్ రాధ అన్నారు. మండలంలోని తాళ్లపాటితండా ఎంపీపీఎస్‌లో శుక్రవారం మానుకోటకు చెందిన కడియం ఫౌండేషన్ నిర్వహించిన వేసవి శిక్షణ తరగతుల ముగింపు సమావేశంలో ఆమె మాట్లాడారు. ఈసందర్భంగా వేసవి శిక్షణ తరగతులు నిర్వహించిన వలంటీర్ రవీందర్‌ను శాలువాతో సన్మానించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ పాఠశాల ఉపాధ్యాయ బృందం ప్రోత్సాహంతో కడియం ఫౌండేషన్ గ్రామంలోని విద్యార్థులకు ప్లేవే పద్ధతి ద్వారా విద్యనందించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎం సోమ రవి, కడియం ఫౌండేషన్ సభ్యుడు జితేందర్, సీఆర్పీ నరేష్, ఉపాధ్యాయురాలు ఉమ, అంగన్‌వాడీ టీచర్ పార్వతి, రమాదేవి, రాజు, దేవి, శ్రీను పాల్గొన్నారు.



వలంటీర్‌ను సన్మానిస్తున్న సర్పంచ్ రాధ

జాబితాలో ముదిరాజ్ కులాన్ని చేర్చాలి

దంతాలపల్లి: ముదిరాజ్‌లకు కులవృత్తి లేదా అని అని సంఘం మెపా జిల్లా ఉపాధ్యక్షుడు చిల్ల నిరంజన్ ముదిరాజ్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన రూ.లక్ష ఆర్థికసాయం అందజేసే జాబితాలో ముదిరాజ్ కులాన్ని చేర్చకపోవడంలో ఆంతర్యం ఏంటని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. ముదిరాజ్‌లను జాబితాలో చేర్చి ఉత్తర్వులు జారీ చేయాలన్నారు. అప్పటి వరకు పథకాన్ని నిలిపివేయాలని, లేదంటే రాష్ట్ర వ్యాప్తంగా నిరసన కార్యక్రమాలు చేపడతామని తెలిపారు. కార్యక్రమంలో పులువురు సంఘం నాయకులు పాల్గొన్నారు.

మొక్కుబడిగా..

- కొనసాగుతున్న 'బడిబాట'
- కరువైన అధికారుల పర్యవేక్షణ
- 70శాతం ఉపాధ్యాయుల గైర్హాజరు

గార్ల: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రభుత్వ పాఠశాలల మనుగడ కోసం నిర్వహిస్తున్న ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట కార్యక్రమం మండలంలో మొక్కుబడిగా కొనసాగుతుంది. ఈనెల 3వ తేదీ నుంచి 17వ తేదీ వరకు రోజువారి కార్యక్రమాల్లో భాగంగా ప్రతీ ఉపాధ్యాయుడు తమ పాఠశాల హ్యాబిటేషన్స్ పరిధిలో ఇంటింటికి తిరిగి ప్రభుత్వ పాఠశాలల్లో ప్రభుత్వం కల్పిస్తున్న సౌకర్యాల గురించి విద్యార్థుల తల్లితండ్రులకు వివరిస్తూ తమ పాఠశాలల్లో విద్యార్థులను చేర్పించే విధంగా కృషిచేయాలి. అయితే గార్ల మండలంలో మాత్రం విద్యాశాఖ అధికారుల పర్యవేక్షణ లోపంతో మండలంలో పనిచేస్తున్న ఉపాధ్యాయులు 70శాతం బడిబాట కార్యక్రమానికి గైర్హాజరవుతూ ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాలను గండి కొడుతున్నారనే విమర్శలు సర్వత్రా వినిపిస్తున్నాయి. తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవానికి సైతం జెండావందనం కార్యక్రమనానికి కొంతమంది ఉపాధ్యాయులు మాత్రమే హాజరయ్యారు. దీనికి కారణం మండలం లో పనిచేసే ఉపాధ్యాయుల్లో 90శాతం ఖమ్మం, మహబూబాబాద్ పట్టణాల నుంచి రాకపోకలు సాగిస్తుండటంతో బడిబాట కార్యక్రమం మొక్కుబడిగా కొనసాగుతుంది. ఈవిద్యా సంవత్సరంలో మండలంలో 10వ తరగతిలో ఉత్తీర్ణత శాతం చాలా తగ్గింది. పెద్దకిష్టాపురం హైస్కూల్లో 12మంది విద్యార్థులకు గాను 12 మంది విద్యార్థులు ఫెయిల్ అయ్యారు. ఉపాధ్యాయులు స్థానికంగా ఉండకుండా వేలాది రూపాయలు ఏజెన్సీ అలవెన్సులు పొందుతూ ఉపాధ్యాయుల్లో చదువు నేర్పాలనే పట్టుదల, జవాబుదారితనం లోపించి విద్యార్థులకు అన్యాయం చేస్తున్నారు. ఇప్పటికైనా జిల్లా విద్యాధికారి స్పందించి మండలంలో బడిబాట కార్యక్రమం విజయవతం చేస్తూ, ప్రభుత్వ విద్యను బలోపేతం చేసేందుకు చర్యలు తీసుకోవాలని విద్యార్థుల తల్లితండ్రులు కోరుతున్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య

కురవి: సీరోలు, కురవి మండలాల్లోని వివిధ గ్రామాల్లో ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట శుక్రవారం కొనసాగింది. సీరోలు మండలం కాంపల్లి శివారు బీల్యా నాయక్ తండాలో హెచ్‌ఎం గుగులోత్ బాలునాయక్, స్కూల్ కాంప్లెక్స్ హెచ్‌ఎం కె.లక్ష్మినారాయణ ఆధ్వర్యంలో విద్యార్థులను బడిలో చేర్పించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు నరేందర్, శంకర్, శ్రీలక్ష్మీ, శాంతకుమారి, తల్లిదండ్రులు పాల్గొన్నారు. కురవి మండలం గుండ్రాతిమడుగు (విలేజి) గ్రామంలో, రాజోలు జెడ్పీ హైస్కూల్ ఆధ్వర్యంలో బడిబాట నిర్వహించారు. ఆయా కార్యక్రమాల్లో హెచ్‌ఎం లక్ష్మయ్య, ఉపాధ్యాయులు లలిత, రమ, లక్ష్మా, ఆత్మ చైర్మన్ తోటలాలయ్య, హెచ్‌ఎం వి.బాలాజీ పాల్గొన్నారు.

పెద్దవంగర: ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య అందుతుందని అవుతాపురం హెచ్‌ఎం అల్లం దాసు భిక్షపతి అన్నారు. ఉపాధ్యాయులు రవికుమార్, రమేష్, కుమార్, రామ్మోహన్, రవి, నర్సింహారావులు పాల్గొన్నారు.

చిన్నగూడూరు: ప్రైవేట్ పాఠశాలలకు ధీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్యతో పాటు మెరుగైన వసతులు కల్పిస్తున్నాయని ఉపాధ్యాయులు తెలిపారు. శుక్రవారం మండల కేంద్రంలో ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు జయశంకర్ బడిబాట కార్యక్రమం నిర్వహించారు. హెచ్‌ఎం రెహమాన్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మహబూబాబాద్ రూరల్: ప్రైవేట్ పాఠశాలలు వద్దు.. ప్రభుత్వ పాఠశాలలే ముద్దు అని అమనగల్ సర్పంచ్ పూజారి మంగమ్మ అన్నారు. మండలంలోని అమనగల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, ప్రాథమిక పాఠశాలల హెచ్‌ఎంలు కళ్లెం వెంకటరెడ్డి, గుగులోత్ సత్యశంకర్ ఆధ్వర్యంలో అమనగల్ గ్రామపంచాయతీ పరిధిలోని యాదవకాలనీలో బడిబాట కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు సదానందం, యుగంధర్, శ్రీనివాస్, రామాచారి, పాల్గొన్నారు.

నెల్లికుదురు: కార్పొరేట్ విద్యాసంస్థలను తలదన్నేలా ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య అందిస్తున్నామని ఎంఈఓ గుగులోతు రాము అన్నారు. ప్రభుత్వ బడుల్లో విద్యార్థుల నమోదు శాతాన్ని పెంచడమే లక్ష్యంగా ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట ఈనెల 3 నుంచి 9వరకు చేపట్టి శుక్రవారం ముగిసింది. కార్యక్రమంలో హెచ్‌ఎం కిషన్, ఉపాధ్యాయులు బిక్కు పాల్గొన్నారు.



కురవి: సీరోలు మండలం బీల్యానాయక్ తండాలో బడిబాట..



పెద్దవంగర: అవుతాపురంలో..

హత్యాయత్నంపై కేసు నమోదు

మహబూబాబాద్ రూరల్: జిల్లా కేంద్రంలోని తీగల సత్యనారాయణ నగర్ కాలనీకిచెందిన గుర్రాల మల్లయ్య అనే వ్యక్తిపై దాడి చేసి హత్యాప్రయత్నం చేయగా బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు నలుగురు వ్యక్తులపై కేసు నమోదు చేశామని టౌన్ ఎస్సై వీ.దీపికరెడ్డి శుక్రవారం తెలిపారు. గుర్రాల మల్లయ్యకు, బండ్యాల శ్రీనివాస్ రెడ్డి, చిట్టి కిశోర్ రెడ్డిలకు మధ్య టిప్పర్ల కిరాయిల విషయాల్లో పాత కక్షలు ఉన్నాయి. ఈ క్రమంలో గురువారం తొర్రూరులో వారు ముగ్గురికి మధ్య గొడవ జరిగింది. సమస్యపై శుక్రవారం పెద్ద మనుషులు సమక్షంలో పంచాయతీ పెడదామని ఒక నిర్ణయానికి వచ్చారు. ఏం జరిగిందో ఏమో కాని శ్రీనివాస్ రెడ్డి, కిషోర్ రెడ్డి, చిట్టి కల్పన, బండ్యాల రోజా నలుగురు కలిసి మల్లయ్య ఇంటి వద్దకు వచ్చి మళ్లీ గొడవకు దిగారు. ఘర్షణ వాతావరణం చోటుచేసుకుని నలుగురు కలిసి మల్లయ్య ఛాతిపై ఎడమ వైపు భాగంలో కత్తితో పొడిచారు. బాధితుడు మల్లయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు సదరు నలుగురు వ్యక్తులపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

దాడి ఘటనలో ఒకరిపై..

మహబూబాబాద్ రూరల్: జిల్లా కేంద్రంలోని అంబేడ్కర్ సెంటర్ సమీపంలో నరాల యాకయ్య అనే వ్యక్తిపై అనబత్తుల లింగస్వామి అనే వ్యక్తి దాడి చేసి గాయపర్చగా బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు లింగస్వామిపై కేసు నమోదు చేశామని టౌన్ ఎస్సై ఎస్.రవి శుక్రవారం తెలిపారు. వివరాలు అనబత్తుల మహేశ్వరి, లింగయ్య దంపతుల మధ్య భార్యభర్తల పంచాయతీ ఉండగా జిల్లా కేంద్రానికి వస్తారు. పంచాయతీ పూర్తయ్యాక మహేశ్వరి తనను బస్ స్టాండ్ వద్ద వదిలిపెట్టి రమ్మని యాకయ్యతో చెబుతుంది. దీంతో అతడు ఆమెను తన ద్విచక్రవాహనంపై బస్ స్టాండ్ వద్ద దింపేందుకు వెళ్తాడు. ఈ క్రమంలో లింగస్వామి వచ్చి మహేశ్వరిని ఎందుకు నీ వాహనంపై తీసుకువెళ్లావు అంటూ యాకయ్యతో వాగ్వివాదానికి దిగి అతడిని తలపై కొట్టి గాయపరుస్తాడు. దీంతో యాకయ్య పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పోగొట్టుకున్న బంగారు బ్రాస్‌లెట్ అప్పగింత

మహబూబాబాద్ రూరల్: ఓ వ్యక్తి తన బంగారు బ్రాస్‌లెట్‌ను పోగొట్టుకోగా పోలీసులు గంట వ్యవధిలోనే సదరు వ్యక్తికి అప్పగించిన సంఘటన జిల్లా కేంద్రంలో శుక్రవారం జరిగింది. వివరాలు.. జిల్లా కేంద్రంలోని హైమా గార్డెన్స్ నివాసం ఉండే శ్రీనివాస్ మధ్యాహ్నం వీరభద్ర బార్ అండ్ రెస్టారెంట్ ప్రాంతానికి వెళ్లాడు. అక్కడ పని ముగించుకుని అతడు తిరిగి ఇంటికి వస్తున్న క్రమంలో చేతికి ఉన్న తులన్నర బంగారు బ్రాస్‌లెట్ కనిపించలేదు. తిరిగి వెనక్కి వెళ్లి వెతకగా దొరకలేదు. వెంటనే శ్రీనివాస్ జరిగిన సంఘటనపై పోలీసులకు సమాచారం ఇచ్చాడు. టౌన్ సీఐ వై.సతీష్ ఆదేశాల మేరకు బ్లూకోల్ట్స్ పీసీలు విజయ్, మంగిలాల్ రెస్టారెంట్ వద్దకు వెళ్లి అక్కడి సీసీ కెమెరాలను పరిశీలించి చూస్తారు. జ్యోతిబసు నగర్ ప్రాంతంలో నివాసం ఉండే వెంకన్న అనే వ్యక్తికి ఆ బ్రాస్ లేట్ దొరికినట్లుగా గుర్తిస్తారు. ఆయన వద్దకు వెళ్లి దానిని స్వాధీనం చేసుకుని బాధితుడికి అప్పగించారు.



శ్రీనివాస్‌కు బ్రాస్‌లెట్ అప్పగిస్తున్న పోలీసులు

సమాధిని కూల్చిన ఫారెస్టు అధికారులు



కూల్చిన సమాధిని చూపుతున్న బాధితురాలు

గూడూరు: మండలంలోని సీతానగరం శివారు కొమ్ములవంచ సమీప ఫారెస్టు స్థలంలో నిర్మిస్తున్న సమాధిని కూల్చిన సంఘటన శుక్రవారం జరిగింది. బాధితురాలు ఆకుతోట కాంతమ్మ తెలిపిన వివరాల ప్రకారం.. గత సంవత్సరం తన తల్లిదండ్రులు చీకటి రాములు, కొమురమ్మ దంపతులు మృతిచెందారు. వారి జ్ఞాపకార్థం గత రెండు రోజులుగా సమీప అటవీ స్థలంలో సమాధులను నిర్మించే ఏర్పాట్లు చేసింది. విషయం తెల్సుకున్న ఫారెస్టు అధికారులు వెళ్లి సమాధిని కూల్చి వేశారు. విషయం తెల్సుకుని వెంటనే అక్కడికి వెళ్లిన కాంతమ్మ ఎంత ప్రాధేయపడినా అధికారులు వినకుండా కూల్చివేశారని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. సమాధిని కూల్చిన విషయమై ఎఫ్‌ఆర్వో సురేష్‌ను అడగ్గా, అనుమతిలేకుండా భీమునిపాదం పర్యాటక ప్రాంతం వెళ్లే ఫారెస్టు స్థలంలో కట్టారు. పర్యాటక స్థలం కాబట్టి అభ్యంతరం చెప్పి కూల్చామన్నారు.

గడ్డివాము దగ్ధం

కేసముద్రం: ప్రమాదవశాత్తు నిప్పంటుకుని గడ్డివామి దగ్ధమైన సంఘటన మండలంలోని తావుర్యా తండా జీపీలో శుక్రవారం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. తండాకు చెందిన భుక్యా లచ్చిరాం, భుక్యా రవి, హనుమ రైతులకు చెందిన 8 ఎకరాల గడ్డివామి మీదుగా వెళ్లిన విద్యుత్ తీగలు ఒకదానికొకటి తాకడంతో నిప్పురవ్వలు ఏర్పడి, గడ్డివామిపై పడడంతో నిప్పంటుకుని మంటలు వ్యాపించాయి. బిందెలతో నీళ్లు చల్లినప్పటికీ ఫలితం లేకుండాపోయింది.

బెరైటీస్ లారీ పట్టివేత.. ముగ్గురిపై కేసు



గార్ల: బెరైటీస్ ఖనిజాన్ని అక్రమంగా తరలిస్తున్న లారీని పోలీసులు శుక్రవారం తెల్లవారుజామున పుల్లూరు గ్రామ సమీపంలో పట్టుకొని లారీని సీజ్ చేసి, ముగ్గురుపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై బానోత్ వెంకన్న తెలిపారు. పట్టుబడిన ఖనిజం 15టన్నులు, దాని విలువ సుమారు రూ.లక్ష వరకు ఉంటుందని ఎస్సై తెలిపారు. ఖనిజాన్ని అక్రమంగా తరలిస్తున్న గార్ల మండలం కోట్యానాయక్ తండాకు చెందిన గూగులోత్ భీమానాయక్, ఏపీకి చెందిన దేవళ్ల గురువులు, దేవళ్ల వెంకటేశ్వరరావు లను పోలీసులు అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు. వీరి వెనుక పెద్ద తలకాయలు ఉన్నట్లు సమాచారం. పై ముగ్గురిని పోలీసులు విచారిస్తే అసలు సూత్రదారులు బయటపడే అవకాశం ఉందని స్థానికులు పేర్కొంటున్నారు.